# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి జరిగేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- పేద విద్యార్థుల భవిష్యత్తుకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు సోపానాలుగా నిలుస్తున్నాయని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు.
- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు లబ్ది పొందాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0 పై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 2025-30 సంవత్సరాల మధ్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా నూతన విధానంపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగుమతులు తగ్గించటం, దేశీయంగా ఉత్పత్తి పెంపు, ఎగుమతులు లక్ష్యంగా నూతన విధానానికి రూపకల్పన చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాయలసీమలో శ్రీసిటీ, హిందుపూర్, కొప్పర్తి వంటి ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తికి విస్తృతమైన అవకాశాలున్నాయని, ఈ ప్రాంతాలకు పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా రాష్ట్రంలో పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

==========================

పేద విద్యార్థుల భవిష్యత్‌కు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు సోపానాలుగా నిలుస్తున్నాయని ఆ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. నంద్యాల జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి.. కలెక్టర్ రాజకుమారి గణియాతో కలిసి అక్కడి సాంఘిక సంక్షేమ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో

సౌకర్యాలు, భోజనం, పరిశుభ్రత, భద్రత మొదలైన అంశాలను పరిశీలించి.. సిబ్బందిని, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద విద్యార్థులు వినియోగించుకోవాలని.. ముఖ్యంగా బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

(వాయిస్ 30 సెకన్లు)

==========================

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఒంగోలు పట్టణంలో ఈరోజు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మంగమ్మ కళాశాల ప్రాంతంలో 4 కోట్ల 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సబ్ స్టేషన్ ను మంత్రి ప్రారంభించారు. అలాగే ముంగమూరు కూడలి వద్ద 3 కోట్ల 50 లక్షల రూపాయల ఖర్చుతో నూతనంగా నిర్మించే సబ్ స్టేషన్ నిర్మాణానికి, హౌసింగ్ బోర్డు వద్ద ఆర్.డి.ఎస్.ఎస్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు, వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందంచేందుకు నూతన సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో పర్యటించడం జరిగిందని రవికుమార్ పేర్కొంటూ..

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు లబ్ది పొందాలని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో "పీఎం సూర్య ఘర్" పథకం కింద ఏర్పాటు చేసుకున్న మూడు కిలోవాట్ల సోలార్ వ్యవస్థను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని మేలు పొందాలన్నారు.

విరామం

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==========================

రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ ఈరోజు అమరావతిలో పర్యటించారు. రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అల్ ఇండియా సర్వీస్ అధికారుల నివాస గృహాలు, మంత్రులు, న్యాయమూర్తుల బంగ్లాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాజధాని రెండో దశ భూ సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 12 టవర్లలో 288 క్వార్టర్లు ఈ డిసెంబర్ నాటికి పూర్తవుతాయని, మంత్రులు, జడ్జీల క్వార్టర్లు వచ్చే సంవత్సరం మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయని నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్ ఇచ్చేలా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై ఈరోజు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. లబ్దిదారులు ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి... మొదలైన వివరాలు ఆ టిక్కెట్‌లో పొందు పరచాలని సూచించారు.

==========================

హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో పర్యటించారు. స్థానిక శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడకశిర పట్టణంలోని Indian Designs Experts సంస్థను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. మడకశిరలో 3 వేల 500 మందికి గార్మెంట్స్ ద్వారా ఉపాధి లభించనుందని చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని వంగలపూడి అనిత పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 757 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరికి 443 పాయింట్ల లాభంతో 82 వేల 200 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్ల లాభంతో 25 వేల 090 వద్ద ముగిసింది.

==========================

దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నాటికి ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలియజేశారు.

==========================

==========================